క్లుప్తంగా

బైపాస్‌ను సీసీరోడ్డుగా మార్చాలి


వినతి పత్రం ఇస్తున్న యెఖీన్‌పూర్ గ్రామస్తులు

కోరుట్ల రూరల్: మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామం నుంచి వేములవాడ రోడ్డుకు వరకు ఉన్న బైపాస్ మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని యెఖీన్‌పూర్ గ్రామస్తులు గురువారం మున్సిపల్ కమిషనర్ అందె మారుతీ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. వర్షాకాలంలో మట్టి రోడ్డుపై నడిచి వెళ్లడం ద్విచక్ర వాహనాలకు ఇబ్బందిగా ఉందన్నారు. అదేవిధంగా యెఖీన్‌పూర్ నుంచి సంగెం వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యెఖీన్‌పూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న హోటల్ యజమాని


నగదు అప్పగిస్తున్న సమీరొద్దీన్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చల్‌గల్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఎస్ హోటల్ ఎదురుగా గురువారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. దీంతో అక్కడున్న హోటల్ యజమాని సమీరొద్దీన్ ఆజాద్ వెంటనే 108 కు సమాచారం అందించి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. దీంతో సంఘటన స్థలంలో ఆ వ్యక్తి వద్ద కవర్లో ఉన్న రూ.1.50 లక్షలు తీసుకుని గాయపడిన వ్యక్తి మిత్రుడు జమ్ము కాశ్మీర్‌కు చెందిన సోన్‌రాజ్‌పుత్‌కు డబ్బులు అప్పగించాడు. దీంతో నిజాయితీ చాటుకున్న సమీరొద్దీన్ ఆజాద్‌ను పలువురు అభినందించారు.

ఆర్డీవో కార్యాలయానికి స్థలం కేటాయించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కృష్ణారావు

కోరుట్ల: కోరుట్లలో ఆర్డీవో కార్యాలయానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కోరారు. ఈ మేరకు జగిత్యాలలో గురువారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, రాజోజీ సదానందాచారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


బడిబాట ర్యాలీలో చిన్నారులు, ఉపాధ్యాయులు

కథలాపూర్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పలువురు హెచ్‌ఎంలు కోరారు. మండలంలోని అంబారిపేట, సిరికొండ, పోసానిపేట గ్రామాల్లో గురువారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. ఉచితంగా విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్నభోజనం అందిస్తామన్నారు. వారి పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కిషన్‌రావు, వసంత, సీఆర్‌పీ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫైలేరియా పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో బుఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఫైలేరియా పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 64 మందికి రక్త పరీక్షలను చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయభాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీ రూపేశ్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ కృపాకర్, ల్యాబ్ టెక్నిషియన్ రహీమతుల్లా, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్ లలిత, అంగన్‌వాడీ టీచర్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలకు రక్షణ కరువు

- మందుబాబులకు అడ్డాలుగా మారిన వైనం..
- సామగ్రి ఎత్తుకెళ్తున్న దొంగలు
- మరుగుదొడ్ల ధ్వంసం


ధ్వంసమైన భూషణరావుపేట రైతు వేదిక తలుపు


బ్యాటరీలు దొంగతనం జరిగిన కథలాపూర్ రైతు వేదిక

కథలాపూర్: రైతులకు పంటలసాగు, కొత్త పథకాలపై వివరించేందుకు వీలుగా ఉండాలని గత ప్రభుత్వం వ్యవసాయ క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించారు. ఒకొక్క రైతు వేదికకు రూ. 22 లక్షలు వెచ్చించారు. ఇదంతా బాగానే ఉన్న రైతు వేదికలు గ్రామాలకు కాస్తా దూరంగా ఉండటంతో ఆస్తులకు రక్షణ కరువైందని, కనీసం వాటిని శుభ్రం చేసే సిబ్బంది లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు.

మండలంలో ఐదు రైతు వేదికలు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. మండలంలోని కథలాపూర్, భూషణరావుపేట, బొమ్మెన, గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. ప్రతీ రైతు వేదికలో ఏఈవోలకు ప్రత్యేకంగా గది ఉండటంతో రైతులకు అందుబాటులో ఉండాల్సిందే. కొన్ని గ్రామాల్లో రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉండటంతో మహిళా అధికారులు ఒక్కరే అక్కడికి వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారు.

రైతు వేదికలకు రక్షణ కరువు...

రైతు వేదికలు గ్రామాలకు కాస్తా దూరంగా ఉండటంతో రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారాయనే ఆరోపణలున్నాయి. ఉదయం వేళ రైతు వేదిక వద్దకు వెళ్లేవారికి ఖాళీ మద్యం సీసాలు కనిపించడం దీనికి నిదర్శనమని పలువురు మండిపడుతున్నారు. మరోవైపు కథలాపూర్‌లోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచలను ఇచ్చే పరికరాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం దొంగలు బ్యాటరీలు ఎత్తుకెళ్లిన సంఘటన జరిగింది. మరుగుదొడ్ల గదుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో వస్తువులను ధ్వంసం చేసిన సందర్భాలున్నాయి. రైతు వేదికల వద్ద నీటి సౌకర్యం కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతువేదికలను కాపాడేది ఎవరని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ రైతు వేదిక నిర్వాహణకు ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్‌ను నియమిస్తేనే వాటికి రక్షణ ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



ఒక్కొక్క రైతు వేదికను రూ. 22 లక్షలతో నిర్మించారు. రైతు వేదికల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందుతాయి. రైతు వేదికల నిర్వాహణకు కనీసం సిబ్బందిని నియమించకపోవడం దారుణం. ప్రహరీ నిర్మిస్తే రక్షణగా ఉంటుంది. లేకపోతే భవిష్యత్తులో రైతు వేదికల గోడలు, ఫర్నీచర్ ధ్వంసమయ్యే ప్రమాదముంటుంది. ముందస్తుగా రక్షణ చర్యలు చేపట్టాలి.

– ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



రైతు వేదికల ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ప్రతీ రైతువేదిక వద్ద సీసీ కెమెరాలు బిగించాలని, వాచ్‌మెన్‌ను నియమించాలని నివేదిక ఇచ్చాం. రైతు వేదికల వద్ద నీటి వసతి లేకపోవడంతో అధికారులు, రైతులు ఇబ్బందిపడుతున్నారని నివేదికలో పొందుపరిచాం.

– యోగితా, మండల వ్యవసాయ అధికారి, కథలాపూర్

భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ



కోరుట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కోరుట్ల: భారత సైనికులు చేసిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల కోరుట్లలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు గురువారం స్థానిక కోర్టు నుంచి జాతీయ జెండాలతో గోదాం రోడ్, జాతీయ రహదారి నుంచి గాంధీ రోడ్ పై బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కస్తూరి రమేశ్, జనరల్ సెక్రటరీ కొంపల్లి రమేష్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

మల్యాల: భారత సైనికులకు మద్దతుగా గురువారం రాత్రి మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. బార్డర్లో భారత సైనికులు చేస్తున్న పోరాటం గొప్పదని, వారి రుణం తీర్చుకోలేదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈకి రాజారాం తండా వాసుల వినతి

కథలాపూర్: మండలంలోని రాజారాం తండాలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ట్రాన్స్‌కో ఎస్‌ఈ శాలియా నాయక్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. చింతకుంట నుంచి రాజారాం తండా వరకు ప్రత్యేకంగా 11 కేవీ లైన్ ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చాలన్నారు. పలు వాడల్లో చిన్నగా విద్యుత్ స్తంభాలను తొలగించి పెద్ద స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతినాయక్, ప్రకాశ్ నాయక్ పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం లేదు

జగిత్యాలరూరల్: చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లోని సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేదని, కొందరు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో ఎలాంటి హమాలీల కొరత లేకుండా మూడు కాంటాల ద్వారా తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని కూడా తూకం వేసి రైస్‌మిల్లులకు పంపిస్తున్నామని రైతులు అధైర్యపడొద్దన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని టోకెన్ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాగులో మెలకువలపై అవగాహన


రైతులతో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు

బుగ్గారం: రైతు ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమంలో భాగంగా గురువారం బుగ్గారం మండల కేంద్రంలోని రైతువేదికలో స్థానిక రైతులతో పొలాస శాస్త్రవేత్తలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సాగులో పాటించాల్సిన మెలకువలు, వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుని పర్యావరణానికి హాని కలగని రీతిలో పంటల సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.బలరాం,బీ. శ్రీలక్ష్మి, మండల ఏవో అక్షిత, ఏఈవోలు శ్రీనివాస్,నవీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సారంగాపూర్‌లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

సారంగాపూర్: సారంగాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు రైతువేదికలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. దీనితో పాటు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రి కార్యక్రమం చేపడతామని రైతులు ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు వెంకటేశ్, ఆంజనేయులు ఉన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ధర్మపురి: ధర్మపురిలోని నాగమయ్య మానసాదేవి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు ఆలయంలో నాగమయ్య, మానసాదేవిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కొరిడె శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితులు దిలీప్‌శర్మ, కాసర్ల వంశీకృష్ణ, కొరిడె చంద్రశేఖర్‌శర్మ, రఘునాథశర్మల మంత్రోచ్ఛారణలతో విగ్రహ ప్రతిష్ఠాత్సవ, తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, భక్తులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలో ఇటీవల కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను రైతువారిగా సర్వే నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నష్టపోయిన పంటలను పరిశీలిస్తు ప్రాథమిక అంచనా కింద 130 మంది రైతులకు చెందిన 180 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నర్సింహుల పల్లె, తుంగూర్, కొల్వాయి, తాళ్ళధర్మారం, రేకుల పల్లి, కోమన్‌పల్లి, కమ్మునూర్, మంగేళ, చిత్రవేణి గూడెం, దొంకేశ్వరం గ్రామాల్లో పంటల నష్టంపై రైతువారిగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈవో వినోద్, రైతులు ఉన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

సారంగాపూర్: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. నర్సింహులపల్లెలో మాట్లాడుతు అకాల వర్షంతో చేతికి వచ్చిన పంట కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేలు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మెరుగు రాజేశం, నేరెల్ల సుమన్‌గౌడ్ ఉన్నారు.

అలయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా హనుమండ్లు

మేడిపల్లి: అలయన్స్ క్లబ్ దమ్మన్నపేట అధ్యక్షుడిగా రాచెర్ల హనుమాండ్లు ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బండ్ల నరేశ్, కోశాధికారిగా కథలాపురం నరేష్ పీఆర్‌వో గా బండ్ల మురళి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా గవర్నర్ బండ్ల గజానందం తెలిపారు. క్లబ్ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, సురేందర్, రాజశేఖర్, లక్ష్మీపతి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

నేడు 'భూ భారతి' సదస్సు

బుగ్గారం: భూభారతి చట్టం అమలులో భాగంగా శుక్రవారం మండలంలోని వెల్గొండ,గంగాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.వెల్గొండ గ్రామంలో నిర్వహించే సదస్సుకు ధర్మపురి తహసీల్దార్ కృష్ణచైతన్య,గంగాపూర్‌లో నిర్వహించే సదస్సుకు బుగ్గారం తహసీల్దార్ మాజిద్ నేతృత్వం వహించనున్నారు. రైతులు తమ భూసమస్యలపై దరఖాస్తులు సమర్పించుకోవచ్చని అధికారులు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: పాడి రైతులు గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. గురువారం జగిత్యాలలోని బాలపల్లిలో 131 తెల్లజాతి పశువులకు, 138 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ గంగాధర్, విశాల్, నరేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జగిత్యాలక్రైం: పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన వంగలి శ్రీనివాస్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు. బ్రాహ్మణవాడకు చెందిన శ్రీనివాస్ గతనెల 29న పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో గురువారం వంగలి మునీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జోగిన్‌పెల్లిలో ఒకరికి కత్తి పోట్లు

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లికి చెందిన ముక్కెర గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన నల్ల నవీన్ కత్తితో పొడిచాడు. గంగారెడ్డికి, నవీన్‌కు రెండేళ్లుగా పాత కక్షలు ఉన్నాయి. గురువారం గ్రామంలోని హోటల్ వద్ద ఒకరినొకరు తారస పడటంతో గొడవ పడ్డారు. మాటామాటా పెరిగి నవీన్ తన వద్ద ఉన్న కత్తితో గంగారెడ్డిపై దాడి చేశాడు. దాడిలో గంగారెడ్డి తల, చేతికి గాయాలయ్యాయి. అతడిని అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలపై ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్, ఎస్‌ఆర్‌పీ ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. ఉపాధిహామీ పనులపై అభ్యంతరాలుంటే కూలీలు, ప్రజలు గ్రామసభలో చర్చించే అవకాశం ఉందన్నారు. ఈ నెల 9న ఇప్పపెల్లి, తుర్తి గ్రామాల్లో గ్రామసభలుంటాయని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో నిండిపోయిన ధాన్యం


మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ధాన్యం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం నిండిపోయింది. ఒకేసారి రైతులు పొలాలను కోస్తుండడంతో ధాన్యం అమ్మకానికి పెద్ద ఎత్తున తీసుకురావడంతో రైతులు ధాన్యం పోసుకునేందుకు స్థలం లేకుండా పోయింది. ఇబ్రహీంపట్నం సింగిల్ విండో అధికారులు రైతుల కల్లాల వద్ద ధాన్యం పోసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఇబ్రహీంపట్నం సొసైటీ పరిధిలో ఇప్పటి వరకు 532 మంది రైతులుక చెందిన 22,344 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సింగిల్ విండో చైర్మన్ బద్దంగోపి, కార్యదర్శి మంత్రి సతీశ్ తెలిపారు. ఇంకా సుమారుగా 20 వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు వారు తెలిపారు.



కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లను పారవేస్తున్నారు. కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి శివారులో ఉన్న కోళ్ల ఫారాల్లో వ్యాధి సోకి చనిపోతున్న కోళ్లను సంచుల్లో పెట్టి సంగెం శివారు ఎస్సారెస్పీ కెనాల్‌లో పారవేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన కోళ్ల సంచుల్లో కుళ్లిపోయి దుర్గంధం వస్తుందని, పారవేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సంగెం గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్,ఏఈ, ఇరిగేషన్ సెల్ నం.: 9963967931

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


బస్ ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: ఆర్టీసీ బస్ ప్రయాణం సురక్షితమైందని, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాల బారిన పడొద్దని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండలం రామభద్రునిపల్లి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, ఏడుమోటలపల్లి గ్రామాలకు కరీంనగర్ 2 డిపో బస్సు ను గురువారం రామభద్రునిపల్లిలో అధికారులతో కలిసి ప్రారంభించారు. రామభద్రునిపల్లి నుంచి ఎల్లాపూర్ వరకు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగతంలో రద్దు చేసిన బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి మేరకు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రేషన్ దుకాణం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, మాజీ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు అంజయ్య, కొమురయ్య, రవినాయక్, లింగారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రణాళికలు రూపొందించాలి


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

సారంగాపూర్: గ్రామాల్లో 2025–26 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో లచ్చాలు అన్నారు. గురువారం బీర్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పనులు చేపట్టాలన్నదానిపై ప్రజల నుంచి వివరాలు తీసుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. శానిటేషన్‌లో భాగంగా తడి, పొడి చెత్త సేకరణకు ప్రతీ గ్రామాన్ని 2 నుంచి 4 జోన్‌లుగా విభజించి ఏ ఇంటి నుంచి ఎంత తడి, పొడి చెత్త వస్తుందన్న దానిని తూకం వేసి, వాటిని రిజిస్టర్లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలు


విజేతలతో తహసీల్దార్, బల్దియా కమిషనర్

రాయికల్: పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్ మైదానంలో జగిత్యాల జిల్లాస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ముగిశాయి. బాలికల విభాగంలో ఫస్ట్ వివేకవర్ధిని హైస్కూల్, రాయికల్, సెకండ్ వారియర్స్ రాయికల్, థర్డ్ జెడ్పీహెచ్‌ఎస్ లక్ష్మి, వాగ్దేవి మల్యాల, బాలుర విభాగంలో ఫస్ట్ ప్రతిభ హైస్కూల్ నూకపల్లి, సెకండ్ వివేకవర్ధిని రాయికల్, థర్డ్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ జగిత్యాల జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ గౌతమ్, సౌమ్యరెడ్డి, మల్లీశ్వరి, కైరం సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–2006 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. తోటి స్నేహితురాలైన జమున భర్త చనిపోగా, రూ. 21వేల ఆర్థికసాయం అందించారు. తమతో చదువుకున్న రవీందర్, వేదమణి చనిపోవడంతో వారి పిల్లలకు రూ. 50వేల చొప్పున బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి పత్రాలు అందచేశారు. పాఠశాలకు బీరువా అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.